పొంచి ఉన్న ప్రమాదం

- ఏడాదికాలంగా కుంగిపోయిన వంతెన
- ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని స్థానికుల ప్రయాణం
- పట్టించుకోని అధికార యంత్రాంగం


తాలిపేరు ఎడమ ప్రధాన కాలువపై కుంగి ఉన్న వంతెన

చర్ల: మండలంలోని కుదునూరు సమీపంలోని తాలిపేరు ఎడమ ప్రధాన కాలువపై కుదునూరు -వీరాపురం గ్రామాల మధ్యలోని వంతెన కుంగిపోయింది. ప్రమాదభరితంగా మారిపోయింది. ఏడాది కాలంగా ఈ వంతెన ఈ పరిస్థితిలోనే ఉండగా.. ఈ ప్రాంత ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు.

వంతెనకు ఏమైంది..?

సుమారు 4 దశాబ్దాల క్రితం ప్రధాన కాలువ ఏర్పాటు చేసిన సందర్భంలో ప్రతీ గ్రామం నుంచి అటవీ ప్రాంతానికి వెళ్లేందుకు గానూ ఎడమ ప్రధాన కాలువపై పలు చోట్ల వంతెనలను నిర్మించారు. అయితే పలు చోట్ల వంతెనలకు సైడ్ రైలింగ్ ఊడిపోవడం, వంతెన స్లాబులు పగిలిపోవడం వంటివి జరిగాయి. అయితే కుదునూరు నుంచి అటవీ ప్రాంతం మీదుగా వీరాపురానికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన వంతెన విషయంలో మాత్రం రాయితో కట్టిన కింద పిల్లర్లు ఒక్కొక్కటిగా ఊడిపోయాయి. దీంతో వంతెన స్లాబులు పూర్తిగా కుంగిపోయాయి.

బాధితులెందరో..

వంతెనకు ఎగువన ఉన్న వీరాపురానికి చెందిన ఆదివాసీలతో పాటు అక్కడికి వెళ్లే ఉపాధ్యాయులు, వైద్యశాఖ సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది ఈ వంతెన మీదుగానే రోజూ ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఇక ఈ బ్రిడ్జిపై నుంచి అవతలి వైపున ఉన్న గ్రామపంచాయతీ డంపింగ్ యార్డుకు చెత్తను తరలించాల్సి ఉండగా.. బ్రిడ్జి కుంగడంతో ఏడాది కాలంగా స్థానిక గ్రామపంచాయతీ వారు గ్రామంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడం లేదు. సమీపంలో ఉన్న వాగు పక్కన పోసి నిప్పంటిస్తున్నారు. దీంతో ఈ దారి గుండా వచ్చిపోయే వారు పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అదే విధంగా వ్యవసాయ కూలీ పనులకు వెళ్లే వీరాపురం ఆదివాసీలు కుంగిన బ్రిడ్జిపై నుంచి దాటాలంటే భయం భయంగా గడుపుతున్నారు. ఇక వీరాపురంకు చెందిన ఆదివాసీ రైతులు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు ఇతరత్రా బరువైన సామగ్రిని తీసుకెళ్లే సందర్భంలో బ్రిడ్జికి ఇవతలి వైపునే దించి ఒక్కొక్కదానిని అవతలికి చేర్చి అక్కడి నుంచి తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అదే విధంగా గ్రామానికి చెందిన స్మశాన వాటిక కూడా అవతలి వైపునే ఉండడంతో అంత్యక్రియల కోసం మతదేహాలను తరలించే సందర్భాల్లోనూ భయం భయంగానే బ్రిడ్జి దాటాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

వెంటనే ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి కుంగిన వంతెన స్థానంలో కొత్త వంతెనను నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కొత్త వంతెన నిర్మించాలి



తాలిపేరు కాలువపై ఉన్న బ్రిడ్జి కుంగడం వల్ల అవతలికి వెళ్లాలంటే భయం భయంగా ఉంది. వేరే మార్గం లేకపోవడంతో ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని దానిపై నుంచే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వెంటనే అధికారులు కొత్త బ్రిడ్జిని నిర్మించాలి.

– పొగళ్ల రాము, కుదునూరు

ఏడాది కాలంగా అవస్థలు



బ్రిడ్జి కుంగి ఏడాది కావస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం లేదు. అడవికి వెళ్లి కట్టెలు తెచ్చుకోవాలన్నా, ఎవరైనా చనిపోతే శ్మశాన వాటిక వైపునకు వెళ్లి రావాలన్నా కష్టతరమవుతోంది. ఎప్పుడు కూలిపోతుందోనని భయంగా ఉంది.

– బొల్లం ప్రదీప్, కుదునూరు

ప్రతిపాదనలు పంపాం



తాలిపేరు ప్రధాన కాలువపై కుదునూరు సమీపంలో కుంగిన బ్రిడ్జిని తొలగించి, కొత్త బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు పంపాం, అనుమతులు రాగానే ఈ ప్రాంతంలో కొత్త బ్రిడ్జిని నిర్మిస్తాం.

–తిరుపతి, డీఈ, తాలిపేరు ప్రాజెక్టు

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

- సరిహద్దు ప్రాంతాల్లో గస్తీ..
- మావోయిస్టుల బంద్ పిలుపుతో ఏజెన్సీలో అలర్ట్


చర్ల: తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

చర్ల: మావోయిస్టుల బంద్ పిలుపు నేపథ్యంలో ఏజెన్సీలో పోలీసులు అలర్ట్ అయ్యారు. ములుగు జిల్లాలోని ఏటూరినాగారం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందిన నేపథ్యంలో ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని, దీనిని ఖండించాలని పిలుపునిస్తూ మావోయిస్టు పార్టీ తెలంగాణా రాష్ట్ర కమిటీ నిరసనగా డిశంబర్ 7న బంద్‌కు పిలుపునిచ్చింది. దీంతో ఇటు భద్రాద్రి కొత్తగూడెం, అటు ములుగు జిల్లాల్లో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. సహచరులను కోల్పోయిన మావోయిస్టులు ప్రతీకారేచ్ఛతో దాడులు, విధ్వంసాలకు దిగవచ్చునన్న అనుమానంతో ఏజెన్సీలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. తెలంగాణా-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో గస్తీని ముమ్మరం చేశారు. దీంతోపాటు అదనపు బలగాలను అటవీ ప్రాంతాలకు తరలిస్తూ కూంబింగ్‌ను కొనసాగిస్తున్నారు.

అటవీ ప్రాంతాల మీదుగా వచ్చి పోయే వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకులను అప్రమత్తం చేయడంతో పాటు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని పోలీసులు సూచించారు. బంద్ నేపథ్యంలో మావోయిస్టులు ఎటువంటి విధ్వంసాలకు దిగకుండా ఏజెన్సీలో పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రతను చేపట్టింది.

అనుమానిత వ్యక్తుల సమాచారం ఇవ్వండి

మణుగూరురూరల్: గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని మణుగూరు సీఐ సతీష్‌కుమార్ సూచించారు. మావోయిస్ట్ వారోత్సవాల నేపథ్యంలో మణుగూరు సరిహద్దు ప్రాంతాల్లో మణుగూరు సీఐ సతీష్‌కుమార్ తన సిబ్బందితో కలిసి ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. మణుగూరు నుండి ఏటూరునాగారం, కొత్తగూడెం వైపు ప్రధాన రహదారి గుండా రాకపోకలు సాగించే ప్రతీ వాహనాన్ని నిలిపి సంబంధిత పత్రాలను, పెండింగ్ ఛలాన్ల వివరాలను పరిశీలించారు. అనుమానస్పద వ్యక్తుల వివరాలను సేకరించి వదిలేశారు. సరైన పత్రాలు లేని వాహన యజమానాలను ఈ-ఛలానాలను విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతీ వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలని, ట్రాఫిక్ నియమనిబంధనలను పాటించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'అనిల్ లెవెన్'దే పైచేయి..

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఐటీడీఏ రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో డిసెంబర్ 5వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరుగుతున్న మొదటి స్టేట్ లెవెల్ భద్రాద్రి బౌంటీ లైట్ వెయిట్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతోంది. ఆదివారం ఉదయం విరాట్ లెవెన్ వర్సెస్ అనిల్ లెవెన్ మధ్య మ్యాచ్ జరిగింది. మొదటిగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 10 ఓవర్లలో 10 వికెట్లు నష్టపోయి అనిల్ లెవెన్ 67 పరుగులు చేసింది. అనంతరం 68 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన విరాట్ లెవెన్ 10 ఓవర్లలో కేవలం 20 పరుగులు మాత్రమే చేసి 10 వికెట్లు నష్టపోయి ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో 20 పరుగులు చేసి, 5 వికెట్లు తీసి అప్పుకు మాన్‌ఆఫ్‌ది మ్యాచ్‌ను అందించారు. ప్రవీణ్, నంద గోపాల్, సుబ్బు, నారాయణ, మణికంఠ, శ్రావణ్ పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత


ఎంఈఓ సున్నం సమ్మయ్యకు సమ్మె నోటీస్ అందజేస్తున్న సిబ్బంది

దుమ్ముగూడెం: మండలంలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు నిరాహార దీక్షలు చేస్తున్న సిబ్బందిని ప్రభుత్వం చర్చలకు పిలువకపోతే.. 10వ తేదీ నుంచి సమ్మె చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఎంఈఓ సమ్మయ్యకు సమ్మె నోటీస్ అందజేశారు. పెన్ డౌన్, చాక్ డౌన్ వల్ల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్, భవిత సెంటర్లలో బోధన ఆగిపోతుందని తెలిపారు. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గుండి దుర్గారావు, శోభారాణి, భవాని, రేఖ, ఆశీర్వాదం, ముద్దరాజు, రమాదేవి, తులసీరాం, జయరావు, రామలక్ష్మి పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం


వైద్యశిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న డాక్టర్లు

దుమ్ముగూడెం: మండలంలోని శ్రీనగర్ కాలనీ గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన చిన్నపిల్లల ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరాన్ని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ చైతన్య, డాక్టర్ ఎస్ఎన్ రాజు, డాక్టర్ పి.రాజశేఖర్‌లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ చైతన్య మాట్లాడుతూ.. మారుమూల గ్రామంలో చిన్నపిల్లల కోసం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో నవజాత శిశువుల నుంచి 14 సంవత్సరాల వయసులోపు ఉన్న 150 మంది పిల్లలను పరీక్షించి రూ.80,000 విలువగల మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.రాజశేఖర్, డాక్టర్ ఎస్ఎన్ రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిలకర నాగరాజు, కొప్పుల మురళి, జిలకర చంటి, కంచర్ల నాగరాజు, జుజ్జూరి జయసింహ, కమల రాజశేఖర్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఐక్య వేదిక సమావేశం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ఆదివారం బీసీ ఐక్య వేదిక సమావేశంలో దాదాపు 33 కులాల కు సంబంధించిన కన్వీనర్ల సమావేశం జరిగింది. పట్టణంలోని గోల్డ్ స్మిత్ కాలనీలోని వీరబ్రహ్మంగారి కల్యాణ మండపంలో కన్వీనర్ బొలిశెట్టి రంగారావు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. కోకన్వీనర్లు కడియం రామాచారి , తాళ్ల రవికుమార్ మాట్లాడుతూ.. గడిచిన 75 సంవత్సరాల నుంచి బీసీలకు తీవ్రంగా అన్యాయం జరిగిందని, ఇప్పుడు బీసీలలో చైతన్యం వచ్చిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీ లకు రాజకీయ పార్టీలు సరైన ప్రాధాన్యత ఇవ్వని పార్టీలు కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందని, మేమెంతో మాకంత వాటా ఇవ్వాలని బీసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 33 కులాలు సంఘం పెద్దలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన

దమ్మపేట: మండలంలో ఆదివారం పర్యటించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల కేంద్రం, దమ్మపేట ప్రధాన రహదారిపై నిర్మాణంలో ఉన్న సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలించి, త్వరితగతిన పూర్తిచేయాలని సబంధిత అధికారులకు సూచించారు. ముష్టిబండ గ్రామంలో నూతనంగా నిర్మించిన మసీదు, ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలు గ్రామాల్లో వివాహ కార్యక్రమాలకు హాజరై వధువరూలను ఆశీర్వదించారు.

ప్రైవేటీకరణ కోసమే నూతన విద్యుత్ చట్టం


అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

మణుగూరుటౌన్: విద్యుత్ రంగం ప్రైవేట్ పరం చేసి స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం కోసమే బీజేపీ ప్రభుత్వం 2019 నూతన చట్టాన్ని తీసుకొచ్చిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి అన్నారు. ఆదివారం మణుగూరులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) నాలుగో మహాసభలు కొలగాని రమేశ్, పులి గణేశ్ అధ్యక్షతన నిర్వహించగా.. ఆయన హాజరై మాట్లాడారు. ప్రైవేట్ కంపెనీలకు విదేశీ కంపెనీలకు విద్యుత్ రంగంలో భాగస్వామ్యం కల్పించడం అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. సోలార్ పవర్ పేరుతో బీజేపీ చేస్తున్న విధానాలు కంపెనీకి లాభాలు చేకూర్చిపెడుతున్నాయన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రధాన కంపెనీలు లంచాలు ఇచ్చి అధిక రేట్లకు విద్యుత్‌ను అమ్మి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నట్లు వెల్లడైందన్నారు. ఇటువంటి అవినీతి అక్రమాలకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తున్నట్లు విమర్శించారు. విద్యుత్ రంగ సంస్థల పరిరక్షణ కోసం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎన్‌పీడీఎస్ఎల్ కంపెనీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుల్లి వెంకటరాజులు మాట్లాడుతూ... భవిష్యత్‌లో మరిన్ని పోరాటాల ద్వారా సంఘాన్ని జిల్లాలో తిరుగులేని శక్తిగా నిలబెడతామని పేర్కొన్నారు. అనంతరం పోరాటాల ద్వారా సాధించిన విజయాలను మహాసభలో వివరించారు. దివంగత మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య, తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.కిరణ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో గద్దల శ్రీనివాస్, సత్రపల్లి సాంబశివరావు, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కునురాజు శ్రీనివాస్, పదిలం శ్రీనివాస్ వర్మ, జి.వెంకన్న, సీతారాములు, కనుకు సత్యనారాయణ, రమేశ్ మధు, లీలావతి, విజయలక్ష్మి ఉన్నారు.

మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం


దమ్మపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సంతకం చేస్తున్న వాసం రాణి, పక్కన ఎమ్మెల్యే

దమ్మపేట: దమ్మపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా ఎంపికైన వాసం రాణి ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. బాధ్యతలను స్వీకరించారు. ఆదివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్, వైస్ చైర్మన్ కణితి సత్యనారాయణలతో పాటుగా 12 మంది పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన పాలకవర్గ కమిటీని ఎమ్మెల్యే జారే, అధికారులు, కాంగ్రెస్ నాయకులు శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మార్కెట్‌ను మరింతగా అభివృద్ధి చేయాలని సూచించారు. నాయకపోడు తెగకు చెందిన పాత తరం కాంగ్రెస్ నాయకులకు అవకాశం కల్పించాలనే తన నిర్ణయం మేరకు వాసం రాణికి చైర్మన్ పదవి దక్కిందని స్పష్టం చేశారు.

తుమ్మల అనుచరులు దుమ్మా..

కాగా, ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రి తుమ్మల అనుచరులు దాదాపుగా హాజరు కాకపోవడం చర్చాంశనీయంగా మారింది. దమ్మపేట మండలంలోని నాయకపోడు సామాజిక వర్గానికి చెందిన తుమ్మల అనుచరుడు, ఈ చైర్మన్ పదవి కోసం పలు ప్రయత్నాలు చేసినప్పటికీ.. పదవి దక్కలేదు. ఈ కారణంగా తుమ్మల అనుచరులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కాలేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్, ప్రత్యేక కార్యదర్శి రాములు నాయక్, టీపీసీసీ మెంబరు నాగ సీతారాములు, మండల కాంగ్రెస్ నాయకులు మద్దిశెట్టి సత్యప్రసాద్, పర్వతనేని ప్రసాద్, సోయం ప్రసాద్, చిన్నశెట్టి యుగంధర్, సాయిల నర్సీ, శ్రీరాముల ప్రసాద్, మొబగాపు చెన్నకేశవులు, జ్యేష్ట సత్యనారాయణ చౌదరి, బత్తుల అంజి, భోజ్యా నాయక్, జూపల్లి ప్రమోద్, తుమ్మా రాంబాబు, చిన్నశెట్టి చిట్టిబాబు, మారెబోయిన హరిబాబు, రావు రవిశంకర్, వాసం శ్రీను, పగడాల రాంబాబు, వేణు, కార్యకర్తలు, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు దమ్మపేట వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. దమ్మపేటలోని సంఘ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, నాయకులు పేటేటి నర్సింహారావుతోపాటు పలువురు తరలి వెళ్లారు. నూతన చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన వాసం రాణితోపాటు వైస్ చైర్మన్‌గా ఎంపికైన మండలపరిధిలోని గంగారం చెందిన కణితి సత్యనారాయణ, నూతన డైరెక్టర్లు బింగి శేషగిరిరావు, జర్పుల తులసీరాంలను దుశ్శాలువతో సత్కరించారు. సొసైటీ డైరెక్టర్ జుబ్బూరి గోపాల్, జహీరుద్దీన్, బుగ్గారపు సత్యనారాయణ, కొప్పుల రాంబాబు, వాడే శేషగిరి, భూక్యా పత్తీలాల్, గాడెగోని జగదీష్, మడకం శ్రీను, సురభి రాజేశ్, కుంజా వెంకట్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ములకలపల్లి: మతోన్మాద శక్తులపట్ల అప్రమత్తంగా ఉండాలని జమాతే ఇస్లామీ హింద్ (జేఐహెచ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఖాలీద్ ముబషీర్ జఫర్ అన్నారు. మండలపరిధిలోని జగన్నాథపురంలో ఆదివారం జరిగిన సంఘ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. అనాదిగా అన్యోన్యంగా, సామరస్యంగా సోదరభావంతో జీవిస్తున్న దేశప్రజల మధ్య కొన్ని దుష్టశక్తులు చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. జేఐహెచ్ రాష్ట్ర కార్యదర్శి నయాముద్దీన్ అహ్మద్, సీనియర్ జర్నలిస్ట్ ఎండీ.ఉస్మాన్‌ఖాన్, హ్యూమన్‌రైట్స్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర డైరెక్టర్ ఫలీఉల్లా, జబ్బార్, జిల్లా అధ్యక్షుడు ఫారూక్ యజ్దాని, మునీబ్ అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

అశ్వాపురం: ఇటీవల యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన మండల అధ్యక్షుడు బూర్కా అశోక్, ఉపాధ్యక్షుడు గొల్లపల్లి నరేష్ ఆదివారం మణుగూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే పాయం అశోక్, నరేష్‌కు శుభాకాంక్షల తెలిపి శాలువాతో సన్మానించారు. యూత్ కాంగ్రెస్ కార్యక్రమాలు చేపడుతూ పార్టీ బలోపేతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, వీరభద్రారెడ్డి, పాయం సర్వేశ్వరరావు, పొడియం అనిల్, వెంకన్న, రాజేష్, పండు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

భద్రాచలంలో భక్తి ప్రచారం

భద్రాచలంఅర్బన్: పోకల దమ్మక్క, భక్త కన్నప్ప, శబరిమాతలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటన చేస్తున్నట్లు దళిత పూజారీ గాదే పాక రాములు స్వామి తెలిపారు. శనివారం సాయంత్రం భద్రాచలం చేరుకున్న రాములు స్వామిని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. వరంగల్ జిల్లా, దువ్వాడ మండలం, ముదునూరు గ్రామానికి రాములు స్వామి గత 30 సంవత్సరాలుగా ఆధ్యాత్మిక విషయాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లేందుకు, ఆయన హిందూ ధార్మిక కార్యక్రమాలను నెలకోల్పేందుకు ఎన్నో పోరాటాలను చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం భద్రాచలం పట్టణంలో ఉన్న వివిధ కాలనీలో రాముల స్వామి కాలినడకన తిరుగుతూ భక్తి ప్రచారాన్ని నిర్వహించారు.

పరామర్శ..

దుమ్ముగూడెం: మండలంలోని పలు గ్రామాల్లోని కాంగ్రెస్ నాయకులను పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర అటవీశాఖ అభివృద్ధి చైర్మన్ పొదెం వీరయ్య ఆదివారం పరామర్శించారు. రేగుబల్లి గ్రామంలో గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన తోటమల్ల సంగీతరావు, లక్ష్మీనగరం గ్రామంలో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కొడిమి మల్లీశ్వరి కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు వీరమాచినేని వీనిల్, టీపీసీసీ మీడియా-కమ్యూనికేషన్స్ జిల్లా కన్వీనర్ కనుబుద్ది దేవా, నాయకులు శిరపు అప్పలరెడ్డి, నటరాజ స్వామి, గద్దం బాలాజీ, డింగి సందీప్ రెడ్డి, తరుణ్ మిత్ర, సాంబశివరావు తదితరులున్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని పేదలకు సొంతింటి కల నెరవేర్చాలని మహాజన మహిళా సమైక్య ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సమైక్య జిల్లా అధ్యక్షురాలు మేకల లత మాట్లాడుతూ.. భద్రాచల పట్టణంలో అనేక సంవత్సరాలుగా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేదలు సొంత ఇల్లు లేక అనేక సంవత్సరాలుగా అద్దె ఇళ్లలో జీవనానికి కొనసాగిస్తున్నారని అన్నారు. గత తెలంగాణ ప్రభుత్వంలో పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇల్లు పేదలకు దక్కుతాయని ఆశతో ఉన్నవారికి నిరాశ మిగిలిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైన కల నెరవేరుతుందని అనుకునేలోపే మరల భంగపాటు జరిగిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ పథకం ద్వారా సొంత స్థలం ఉన్నవారికి మాత్రమే వర్తిస్తుందని, సొంత స్థలం లేని వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వెళ్లినట్లు తెలిపారు. సొంత స్థలం లేని నిరుపేదలకు స్థలం ఇప్పించి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యేలా చూడాలని ఎమ్మెల్యే వెంకట్రావుకి విజ్ఞప్తి చేసినట్లుగా ఆమె వెల్లడించారు. మాదిగ మహిళ సమైఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు కొప్పుల నాగమణి, జిల్లా కార్యదర్శి గద్దల కృష్ణ వేణి, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జారేకు..

దమ్మపేట: ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు గోకినపల్లి ప్రభాకర్ స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు విన్నపం చేశారు. ఆదివారం అశ్వారావుపేట మండల పరిధిలోని వినాయకపురం శివారులోని ఎర్రగుంటపల్లి వాసులు, మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని గండుగులపల్లి నివాసంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాలుగా ఎర్రగుంటపల్లి వాసులు ఇంటి స్థలాల కోసం అనేక పోరాటాలు చేస్తున్నారని, వారికి తగిన న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే.. సమస్యను పూర్తిస్థాయిలో పరిశీలించిన పిదప పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మాస్‌లైన్ నాయకులు సలీం, బుచ్చిరాజు, వెంకన్న, మహేష్, వీరబాబు, బుచ్చమ్మ పాల్గొన్నారు.


భద్రాచలంఅర్బన్: ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


దమ్మపేట: ఎమ్మెల్యే జారేను కలిసిన మాస్‌లైన్ నాయకులు, కార్యకర్తలు

క్లుప్తంగా

'నవోదయ'ను ఇక్కడే నెలకొల్పాలి

అశ్వాపురం: నవోదయ పాఠశాలను అశ్వాపురం మండలంలోని బీజీ కొత్తూరులో కేటాయించిన భూమిలోనే ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మొండికుంటలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు చొరవతో ఏజెన్సీ ప్రాంతంలో అశ్వాపురం మండలంలో ప్రభుత్వ భూమి 30 ఎకరాలు అప్పటి కలెక్టర్ నవోదయ స్కూల్‌కు కేటాయించి కేంద్ర ప్రభుత్వానికి పంపించారన్నారు. నవోదయ స్కూల్ ప్రదేశానికి రూ.1.50 కోట్లతో బీటీ రోడ్డు మంజూరు చేసి టెండర్లు కూడా పిలిచారన్నారు. ఇప్పుడు నవోదయ స్కూల్ వేరే మండలానికి తరలించడానికి వీళ్లేదన్నారు. గత ప్రభుత్వంలో సీతారామ ప్రాజెక్ట్ పంపహౌస్ వద్ద ప్రభుత్వ భూమి 50 ఎకరాలలో పాలిటెక్నిక్ కళాశాలకు స్థలం కేటాయిస్తే ఆ కళాశాలను బూర్గంపాడు మండలం కృష్ణసాగర్‌కు తరలించారన్నారు. గత ప్రభుత్వంలో అశ్వాపురం మండలానికి నవోదయ, పాలిటెక్నిక్ విద్యా సంస్థలు ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తే ఈ ప్రభుత్వంలో ఆ సంస్థలు వేరే మండలానికి తరలివెళ్లడం ప్రజల దురదృష్టకరమన్నారు.

టీచర్ల సంక్షేమానికి కృషి

అశ్వారావుపేటరూరల్: ఉపాధ్యాయుల సంక్షేమానికి పీఆర్‌టీయూ సంఘం కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆదివారం ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నూతన ఉపాధ్యాయులకు భవిష్యత్‌లో మంచి పీఆర్‌సీ వచ్చేలా కృషి చేస్తుందని అన్నారు. అనంతరం నూతన ఉపాధ్యాయులకు సంఘం ఆధ్వర్యంలో సేవా గ్రంథాలను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో బి.రవి, ఆర్.రాంప్రసాద్, బి.సత్యనారాయణ, బజ్జూరి వెంకటేశ్వరరావు, సీహెచ్ అప్పారావు, కేఆర్‌సీ ప్రసాద్ పాల్గొన్నారు.

'వనజీవి'ని కలిసిన పాషా

గుండాల: పర్యావరణ పరిరక్షణ కోసం డబ్ల్యూఈఓ తెలంగాణ స్టేట్ గ్రీన్ రేంజర్ కోఆర్డినేటర్, జాకారం పాఠశాల హెచ్ఎం.షేక్ మహమూద్ పాషా ఏక భుక్త దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. కాగా దీక్ష ఆదివారం రోజు ప్రారంభమైన సందర్భంగా పద్మశ్రీ వనజీవి రామయ్యను ఖమ్మంలో ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రామయ్యను సన్మానించారు. జాకారం పాఠశాలకు రావాలని ఆహ్వానించినట్లు తెలిపారు. గడిచిన రెండు సంవత్సరాలుగా తాను చేసిన దీక్షలు, మొక్కలు నాటడం, భద్రాచలం అడవుల్లో విత్తనాలు చల్లడం మొదలైన కార్యక్రమాల గురించి రామయ్యకు వివరించినట్లు తెలిపారు. రామయ్యను సన్మానించిన వారిలో ప్రకృతి ప్రేమికులు ప్రకాష్, సంపత్, సందీప్, శ్రీనివాస్, కిరణ్, షేక్ రూహిత్, సాయినాథ్, సైదులు,పవన్, విష్ణు, రాజ, మనీ, వి.పవన్ ఉన్నారు.

సుస్థిరతకు పాటుపడుదాం..

చండ్రుగొండ: దేశంలో శాంతి సుస్థిరత కోసం పాటుపడుదామని జమాతే ఇస్లామిహింద్ రాష్ట్ర అధ్యక్షుడు ఖలీద్ ముబషిరూస్ సఫర్ పిలుపునిచ్చారు. మండలకేంద్రం చండ్రుగొండలో ఆదివారం ఆయన పర్యటించారు. సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులమతాలకు అతీతంగా మానవీయ కోణంలో అందరూ కలిసి కట్టుగా ఉంటే దేశం శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లుతుందన్నారు. ఈ సమావేశంలో జేఐహెచ్ జిల్లా అధ్యక్షుడు షారూఖ్‌యజ్దాని, జిల్లా ఉపాధ్యక్షుడు షరీఫ్, మండల అధ్యక్షుడు యండి.షబ్బీర్‌హుసేన్, ఎస్‌కె.మౌలాలీ, మస్తాన్‌సాహెబ్, అశ్రఫ్, ముర్తుజా, నాగుల్‌మీరా, మీరే రబ్బాని, అల్తాఫ్, ఆసీఫ్‌పాష, సయిద్‌హుసేన్ పాల్గొన్నారు.

సాయిబాబా రథోత్సవం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డులోని షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయి మాలదారులచే రథోత్సవం సాయిబాబా మందిరంలో కన్నుల పండుగలా సాగింది. బాబా ఆలయం నుంచి ఊరేగింపుగా బాణసంచాతో గోదావరికి బాబా వారి ఉత్సవమూర్తిని తీసుకువెళ్లి గోదావరిలో చక్రస్నానం, అభిషేకం చేయించారు. బాబా మాల ధరించిన భక్తులు భక్తిశ్రద్ధలతో సాయి నామ జపం చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు తుమ్మలపల్లి సత్యనారాయణ మూర్తి, ఉపాధ్యక్షుడు మాగంటి శ్రీనివాస వరప్రసాద్, కోశాధికారి కుంచాల రమేష్ సభ్యులు అబ్బినేని శ్రీనివాసరావు, గొర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగికి సన్మానం

ములకలపల్లి: ఉద్యోగికి బదిలీ సహజమని మున్నూరుకాపు సంఘ మండల గౌరవ అధ్యక్షుడు పువ్వాల మంగపతి, మండల అధ్యక్షుడు మేకల పెద్ద వెంకన్న అన్నారు. ఏపీజీవీ బ్యాంక్ ములకలపల్లి శాఖలో దనసరి ఉద్యోగిగా పనిచేసి, పర్మినెంట్ అయి బదిలీపై జగన్నాథపురం శాఖకు వెళ్తున్న అలుగుల కొండల్‌రావు దంపతులను సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. దుశ్శాలువ కప్పి, పూలమాలతో సన్మానించారు. అయితా శేషగిరిరావు, బుగ్గారపు సత్యనారాయణ, శనగపాటి రవి, మిరియాల అవినాశ్, శనగపాటి అంజి, పువ్వాల కొండల్‌రావు, ముదిగొండ శ్రీను, శనగపాటి సుదర్శన్, పసుపులేటి శ్రీను, సీతారాములు, హనుమంతు పాల్గొన్నారు.